తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## గడ్డి తింటూ అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

కుప్పం, డిసెంబర్ 19 ప్రభాతవార్త



సమస్యల సాధన కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం కుప్పంలో వినూత్నంగా నిరసన తెలిపారు. గడ్డి తింటూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు రాకపోగా తామేం తిని బతకాలని ప్రశ్నించారు. అంగన్‌వాడీ అద్దె కేంద్రాల అద్దెలు కూడా చెల్లించలేదని వాపోయారు. అప్పులు చేసి అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించామన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించేదాకా సమ్మె విరమించేది లేదని పేర్కొన్నారు.

## వెంకన్న సేవలో గవర్నర్ నజీర్

తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం ఉదయం రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ దర్శించుకున్నారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికి, స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

# పూతలపట్టు 'దేశం'కు మళ్ళీ చికిత్స

**డాక్టర్ మురళీమోహన్ అభ్యర్థిత్వంపై నీలినీడలు**
**తెరపైకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పి.రవి పేరు**
**అభ్యర్థిత్వం రేసులో మరో ఐదు మంది అభ్యర్థులు**

చిత్తూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

పూతలపట్టు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని పటిష్టం చేయడానికి ఇప్పటికీ ఒకసారి చికిత్స చేసినా ఆశించిన ఫలితం కన్పించకపోవడంతో మరోసారి పార్టీకి ఆపరేషన్ చేసి పరిస్థితిని చక్కబెట్టాలని పార్టీ అధిష్టానం భావిస్తోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల అనంతరం పూతలపట్టు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చుక్కాలేని నావల తయారైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలైన మాజీ ఎమ్మెల్యే లలితకుమారి అనంతరం పార్టీకి రాజీనామా చేసి వెళ్ళిపోవడంతో అప్పటి నుండి నియోజకవర్గంలో పార్టీకి దిక్కులేకుండా పోయారు. ఈ పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం ఆరు నెలల క్రితం పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేసి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీగా పూతలపట్టు మండలానికి చెందిన డాక్టర్ మురళీమోహన్‌ను నియమించారు. పార్టీ అధిష్టానం నియోజకవర్గానికి పార్టీ ఇన్‌ఛార్జీని నియమించడంతో నియోజకవర్గ పరిధిలో పార్టీ పటిష్టం అవుతుందని పార్టీ నాయకులు భావించారు. అయితే పార్టీ నాయకులు ఆశించిన తరహాల్లో క్షేత్ర స్థాయిలో పార్టీ ముందుకు వెళ్ళకపోవడంతో పార్టీ అధిష్టానం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీపై పునరాలోచన పడినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో పూతలపట్టు నియోజకవర్గం నుండి తెలుగుదేశం తరపున పోటీ చేయడానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పి.రవి పేరు పార్టీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ నియోజకవర్గం నుండి దేశం అభ్యర్థులుగా పోటీ చేయడానికి పూతలపట్టు మండలానికి చెందిన యువ పారిశ్రామికవేత్త ముత్తు సైతం అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కుటుంబం అండదండలు ముత్తుకు పుష్కలంగా వుండటంతో ఈ మేరకు ఆమె ద్వారా అభ్యర్థిత్వం కోసం ముత్తు అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అలాగే మరోవైపు జిల్లా పార్టీ నాయకుల ద్వారా ఆనగల్లు మునిరత్నం తన అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే 1999 సంవత్సరంలో వేపంజేరి నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుష్పరాజ్ ఈ సారి పూతలపట్టు నుండి పోటీ చేసి అదృష్టంను పరీక్షించుకోవాలని తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అలాగే ఐరాల మండలంలో పుట్టి తిరుపతిలో నివాసం వుంటున్న మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్తె డాక్టర్ చరిత సైతం పూతలపట్టు నియోజకవర్గం తెలుగుదేశం అభ్యర్థిత్వం కోసం ఆశలు పెట్టుకొని తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ సైతం పూతలపట్టు అభ్యర్థిత్వం కోసం పార్టీ నేతల ద్వారా పోటీ పడుతున్నారు. డాక్టర్ మురళీమోహన్ అభ్యర్థిత్వం ఖరారు సమయంలో ఆర్థికంగా పూర్తి సహకారం అందిస్తామని చెప్పిన వ్యక్తులు ఆపై చేతులు ఎత్తివేయడం, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్ సైతం నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను పూర్తి స్థాయిలో కలుపుకొని వెళ్ళడంలో విఫలం అయ్యారని విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో ఆర్థిక వనరులను పుష్కలంగా ఖర్చు చేయడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలను పూర్తి స్థాయిలో కలుపుకొని పార్టీని క్షేత్ర స్థాయి నుండి పటిష్టం చేసి ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తా వున్న అభ్యర్థి కోసం పార్టీ అధిష్టానం జల్లెడ పట్టి గాలిస్తున్నట్లు తెలిసింది. ప్రక్కనే వున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమితులైన డాక్టర్ థామస్‌కు ఆర్థిక వనరులు పుష్కలంగా వుండి నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలను ఒక్కతాటిపై తీసుకువచ్చి పార్టీని క్షేత్ర స్థాయిలో ముందుకు తీసుకెళ్తున్నారు. ఇదే తరహా పూతలపట్టు నియోజకవర్గంలో సైతం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఒకతాటిపై తీసుకువచ్చి మూడు నెలల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని ఎలాగైనా విజయ తీరాలను చేర్చడానికి సమర్థుడైన అభ్యర్థి కోసం పార్టీ అధిష్టానం వెతుకులాట ప్రారంభించింది. త్వరలో నియోజకవర్గ పార్టీకి కొత్త ఇన్‌ఛార్జీ నియమితులు అయ్యే అవకావం కన్పిస్తున్నట్లు నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.

వైకుంఠాన్ని తలపించేలా

## కొండ ముస్తాబు

**ఫల,పుష్పాలతో భారీగా అలంకరణలు**



తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:

వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాలకు తిరుమల ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులకు ఆధ్యాత్మికభావన కలిగించేలా ఆలయం పరిసరాలు ముస్తాబవుతున్నాయి. ఈ ఏడాది వినూత్నంగా మరిన్ని బారీ సెట్టింగ్స్‌ను తీర్చిదిద్దుతున్నారు. వైకుంఠద్వారదర్శనాలకు సంబంధించి టోకెన్,టిక్కెట్లు లేని భక్తులకు ఆలయంలోనికి ప్రవేశం లేదు. దీంతో అలాంటి భక్తుల్లో నిరాశనిస్పృహలు కలగకుండా చక్కటి వైకుంఠద్వారం, శ్రీమహావిష్ణువు,గరుత్మంతుడు వంటి అలంకరణలు పుష్పాలతో తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయి. మంగళవారం ఆలయ శుద్దిజరగడంతో ఆధ్యాత్మికంగా సుందరంగా తీర్చిదిద్దే పనుల్లో టిటిడి ఉద్యానవనవిభాగం సిబ్బంది నిమగ్నమయ్యారు.

## అభివృద్ధికి ఆధార్ జగనన్న సర్కార్

**- మంత్రి రోజా**

నగరి, డిసెంబరు 19 ప్రభాతవార్త:



సిమెంటు రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

అభివృద్ధికి ఆధార్ జగనన్న సర్కార్ అని మంత్రి రోజా అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి రామ్‌నగర్-సీ, ఇందిరా నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. కేవీపీఆర్ పేటలో రెండు వార్డుల్లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తన వద్దకు తీసుకొచ్చిన మురుగు కాలువ, రోడ్డు సమస్యలను పరిష్కరించడం జరుగుతోందన్నారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమం అందిందా, ఏవైనా సమస్యలు ఉన్నాయనా అని తెలుసుకుని ప్రజలకు అవసరమైన వారు సూచించే పనులకే ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ పార్టీనే అన్నారు. మున్సిపల్ పరిధి కేవీపీఆర్‌పేటలో రెండు దఫాలుగా టీడీపీనే గెలుపొందిన వార్డుల్లో గతంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఇప్పుడే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి అన్నారు. ఈ వార్డులోనే 20 లక్షల వ్యయంతో రోడ్లు వేస్తున్నామని, నాడు-నేడు పథకంలో పాఠశాలను నవీకరించడం జరిగిందని, సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, వైస్ ఛైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బిలాల్, గంగాధరం, మురుగ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కో-ఆప్షన్‌సభ్యులు హమీద్, ఎల్లప్పరెడ్డి, డీఈనరేష్,పార్టీనాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైకుంఠ ఏకాదశికి ముందు

## మహాయజ్ఞంలా ఆలయ శుద్ధి

తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:

మోక్షమార్గం వైకుంఠద్వారాలు తెరచుకునే వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ముందు మంగళవారం ఉదయం వెంకన్న ఆలయంలో మహాయజ్ఞంలా ఆలయ శుద్ధి చేపట్టారు. గర్భాలయం, ఉప ఆలయాల గోడలకు ముప్పు వాటిల్లకుండా సుగంధభరితమైన పరిమళ ద్రవ్యాలతో ప్రోక్షణం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు ,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘం సూచించిన మేరకు సిద్ధం కావాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి**

తిరుపతిరూరల్, డిసెంబర్19 ప్రభాతవార్త:



ఎన్నికల సంఘం సూచించిన మేరకు ప్రొఫార్మలో అవసరమైన ప్రణాళికను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి, నివేదించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ ఆర్.ఓ.లతో జిల్లాలోని డి.యస్,పితో సమావేశమై పలు సూచనలు చేసారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈనెల 22, 23 తేదీలలో విజయవాడలో కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తున్నారని, అందుకు అనుగుణంగా నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వాహణకు సంబంధించి పోలీసు, జిల్లా అధికారుల సమన్వయంతో భద్రత ప్రణాళిక, కమ్యూనికేషన్ ప్లాన్, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు, పోలింగ్ సామాగ్రి పంపిణి కేంద్రం, రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, చెక్ పోస్టుల ఏర్పాటు, శాంతి భద్రతలు, ఎన్నికలలో నగదు, మద్యం, మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టడం తదితర అంశాలపై గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎస్.ఎస్.ఆర్-2024 మేరకు నిర్వహిస్తున్న క్లెయిమ్స్ పరిష్కారం పక్కాగా ఉండాలని సూచించారు. ప్రతి క్లెయిమ్ విషయంలో తప్పనిసరి ఫైల్ రూపంలో ఉండాలన్నారు. ఈ సమీక్షలో డిఆర్వో పెంచల్ కిశోర్, అడిషనల్ ఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి సిఎం పెద్దపీట

**వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి**

వెంకటగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త



సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేస్తున్న రాంకుమార్ రెడ్డి

సిఎం జగన్మోహన్ రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 12వ వార్డు పరుమల్లమ్మ గుడి వీధిలో ఆయన మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. చేనేత కార్మికులు 24 వేల రూపాయిలు నేతన్న నేస్తం ఇస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులకు ఎప్పుడు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని సిఎం నెరవేర్చినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వాన్ని మరల అందరూ ఆదరించాలని కోరారు. స్థానికులు సమస్యలను రాంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వెంకటరామ య్య, వైసిపి జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ డిల్లీ బాబు, కౌన్సిలర్లు శివయ్య, గోపాలకృష్ణ, సుబ్బారావు, నారాయణ, కళ్యాణి, పూజారి లక్ష్మి, నాయకులు, లక్కమనేని కోటేశ్వరరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## పోలీసుల పల్లెనిద్ర

గుడిపాల, డిసెంబర్ 19 ప్రభాతవార్త:



క్షేత్ర స్థాయిలో దొంగతనాలు, అక్రమ రవాణా అరికట్టడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి గుడిపాల మండలంలో పోలీసు అధికారులు పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, గుడిపాల ఎస్ఐ రామ్మోహన్‌లు సోమవారం రాత్రి వెప్పాలచేను గ్రామ పంచాయతీ పిళ్ళారికుప్పం గ్రామంలో రాత్రి నిద్ర చేశారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి గ్రామాల్లో ఎలాంటి అసాంఘీక కార్యక్రమాలు జరుగ రాదని, ఎదైనా ప్రజల దృష్టికి వస్తే సత్వరం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అక్రమ రవాణా, నాటు సారా, ఇతర రాష్ట్రాల నుండి మద్యం రవాణా తదితరాలు జరుగకుండా చూడాలన్నారు. అలాగే శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా వుండేలా పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో పరిసరాల్లో చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలకు

## పటిష్టంగా ఏర్పాట్లు చేయండి

**కమిషనర్ హరిత**

తిరుపతి కార్పొరేషన్ , డిసెంబర్ 19, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టత్మాకంగా ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడాత్సవాలను నిర్వహించునున్న నేపధ్యంలో అన్నీ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్ధానిక నగర పాలక సమావేశంలో ఆమె పాల్గొని అధికారులకు దిశ నిర్దేశం చేశారు.సమావేశంలో డిప్యూట్ కమిషనర్ చంద్రమౌళిశ్వర్ రెడ్డి, సూపర్‌డెంట్‌ఇంజినీర్ మోహన్,మునిపల్‌ఇంజినీర్లు చంద్రశేఖర్ వెంకటరామిరెడ్డిలు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరాదికి భక్తులందరికి సంతృప్తికర దర్శనం

**-ఆలయ ఛైర్మన్, ఈఓలు**

కాణిపాకం, డిసెంబర్ 19 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నూతన సంవత్సరాదికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించే విధంగా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. కాణిపాకం దేవస్థానంలో నూతన సంవత్సరాది ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ఆలయ ఛైర్మన్ అధ్యక్షతన మంగళవారం సమన్వయ కమిటి సమావేశం ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో నూతన సంవత్సరాది సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశమున్నట్లు తెలిపారు. ఆలయ దర్శనార్థం తరలివచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమ్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద ఉచిత దర్శనంతో పాటు 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 అతి శీఘ్రదర్శనం, విఐపీలకు, ఆలయ ఉభయదారులకు, దివ్యాంగులకు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా వేర్వేరుగా ఐదు కూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. అలాగే సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా విఐపీలకు ఉదయం 8.30 గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 3.30 గంటల నుండి 5 గంటల వరకు దర్శన సమయాన్ని కేటాయించామన్నారు. ఈనెల 31న అర్ధరాత్రి స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం 2 గంటల నుండి భక్తులకు దర్శనాలు ప్రారంభమై జనవరి 1న రాత్రి 10 గంటల వరకు స్వామివారి దర్శనాలు వుంటుందని ఛైర్మన్, ఈఓలు తెలిపారు. సమావేశంలో ఈఈ వెంకట నారాయణ, చిత్తూరు ఏఎస్పీ సుధాకర్, ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి,వాసు, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, స్థానిక ఎస్సై శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి, పాటు వివిధ ప్రభుత్వశాఖల

## ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంకు పక్కా ఏర్పాట్లు

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**

చిత్తూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త:



ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు డిఆర్‌ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం ఆర్డీఓలు, ఈఆర్‌ఓలు, ఎఇఆర్‌ఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, బిఎల్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంకు సంబంధించి ఇప్పటికే క్రీడా సామాగ్రి క్షేత్ర స్థాయికి చేరిందని, ఇందుకు సంబంధించి పూర్తి స్థాయి ఆన్‌లైన్ రిసీట్లు ఇవ్వాలన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమంకు సంబంధించి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారని, పెండింగ్ ఏర్పాట్లు ఎదైనా వుంటే పూర్తి చేయాలని జెసి అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని, క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఓలు తగిన శ్రద్ధ వహించి ఓటర్ల జాబితా పక్కా రూపకల్పన చేయాలన్నారు. బిఎల్‌ఓలు ధృవీకరించిన జాబితాలు ఎఇఆర్‌ఓలు, ఇఆర్‌ఓల వద్ద ధృవీకరించాల్సి వుంటుందన్నారు. ఇపి రేషియా, జెండర్ రేషియో కచ్చితంగా వుండేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రిసెప్షన్ సెంటర్లు, డిస్పాచ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల గురించి నివేదకలు ఇవ్వాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు నుండి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి శివయ్య, బిసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, గ్రౌండ్ వాటర్ డిప్యుటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి బాలాజీ, డిపిఆర్‌సి షణ్ముగరామ్, డిఎల్‌డిఎ రవికుమార్, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ బ్యూలా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ నేతల మద్దతు

శాంతిపురం, డిసెంబర్ 19 ప్రభాతవార్త



తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలకు కాంగ్రెస్ నేతలు సంపూర్ణమద్దతు పలికారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశంరాజు, ఒబిసి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మురుగన్, గోవిందు తదితరులు సమ్మె శిబిరంకు చేరుకుని మద్దతు పలికారు. అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యకర్తల వేతనంగా 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

కుప్పంరూరల్, డిసెంబర్ 19 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో ఓ వృద్ధుడు, అలగమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలకు ఎమ్మెల్సీ.జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ అందజేసిన చెరో పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని మంగళవారం మున్సిపల్ రెండో వైస్‌ఛైర్మన్ ఎస్‌డి హఫీజ్ అందించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.

## ఓటరు నమోదు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి

కుప్పంరూరల్, డిసెంబర్ 19 ప్రభాతవార్త



జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులు ఓటరు నమోదు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఓటరు నమోదుపై కుప్పంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్హులైన యువతీ యువకులు తగు ఆధారాలతో ఫారం -6 సమర్పించాలని సూచించారు. ఓటుహక్కుఅందరి బాధ్యత అన్నారు. తహశీల్దార్ పార్వతి, ఎపిక్‌డిటిశ్రీదేవి, విఆర్వోలు, కార్యదర్శులుపాల్గొన్నారు.

## అధికారులచే పోలింగ్ కేంద్రాల పరిశీలన

వి.కోట, డిసెంబర్ 19 ప్రభాతవార్త



వి.కోట పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ, పోలీసు అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులు పరిశీలించారు. అవసరమైన ఏర్పాట్ల గురించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు, సిఐ లింగప్ప, ఎస్సై మనోహర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ

ఏడిఏఎం నాగార్జున సాగర్

వెంకటగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త



రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. నాగార్జున సాగర్ తెలిపారు. మండలంలోని వల్లివేడు అమ్మపాలెం ఆర్‌బికెల ద్వారా యూరియా, డిఏపిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వారి గ్రామాల వద్దనే అవసరమైన ఎరువులు పురుగులమందులను తీసుకోవచ్చని తెలిపారు. వెంకటగిరి మండలంలో 1010 టన్నులు, బాలాయపల్లి మండలంలో 550 టన్నులు, డక్కిలి మండలంలో 910 టన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు పంపిణీ చేస్తామన్నారు. ఆర్‌బికె చెంచు భాస్కర్, విఏఏ రేఖ తదితరులు పాల్గొన్నారు.

## యువగళం ముగింపు సభకు తరలి వెళ్లిన టిడిపి నేతలు

**వెంకటగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం ముగింపు సభకు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నుండి భారీగా టిడిపినేతలువిశాఖ పట్నం తరలివెళ్లారు. విశాఖపట్నంకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో వీరు వెంకటగిరి స్టేషన్ నుండి వెళ్లారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల నుండి భారీగా టిడిపి శ్రేణులు సభకు పయనమయ్యారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ జడ్పిటిసి రామచంద్రనాయుడు, నాయకులు ఆనందు, కోటేశ్వర్ రెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు, విశాఖకు వెళ్లారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ మస్తాన్ యాదవ్

**వెంకటగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త** మండలంలోని పెట్లూరు గ్రామానికి చెందిన వీఆర్‌వో వాసు తల్లి శంకరమ్మ అనారోగ్య కారణంగా మృతి చెందడంతో టిడిపి నేత డాక్టర్ మస్తాన్ యాదవ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెట్లూరులో వారి నివాసానికి వెళ్లి శంకరమ్మ భౌతికాయానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. శంకరమ్మకు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

## నాని గెలుపు కోసం కృషి చేస్తాం

యర్రావారిపాలెం, డిసెంబరు 19 ప్రభాతవార్త



జనసేన పార్టీ రాష్ట్ర అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినాని గెలుపు కోసం కృషి చేస్తామని బలిజ సంఘం చంద్రగిరి నియోజక వర్గ అధ్యక్షులు దాసరి విజయకుమార్ చెప్పారు. మంగళవారం భాకరాపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 68 శాతం ఉన్న బడుగులు రాజకీయాలనే శాసించే స్థాయిలో ఉన్నా కూడా బీసీలకు మాత్రం రాజ్యాధికారం నేటికీ అందని ద్రాక్షగానే మిగిలిందన్నారు. జనసేన పార్టీ, టీడీపీలు పొత్తులతో కలిసి సమన్వయంతో పని చేసి టిడిపీనిగెలిపించాలని కోరారు. ఈసమావేశంలో గుర్రంకొండ సిద్దు, చిట్టి తులసీరామ్, రిటైర్డు ఇన్స్పక్టరు కృష్ణయ్య రాయల్, నెల్లూరు బాలసుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

-నాయనివారిపాళెం వాసుల వేడుకోలు

చౌడేపల్లి, డిసెంబర్ 19 ప్రభాతవార్త



ప్రభుత్వ స్థలంతోపాటు అందులో వున్న భవనాలను పరిరక్షించాలని తహశీల్దార్, ఎంపిడిఓలకు వినతిపత్రమందించారు. గ్రామస్తుల కథనం మేరకు...పట్టణంలోని నాయనివారిపాళెంలో ప్రాథమిక పాఠశాల, కమ్మూనిటీ భవనం, గ్రామానికి మంచినీరందించే స్కీమ్ బోరులున్నాయి. అయితే వాటిని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని మహిళలన్నారు. మంచినీటి బోరుకు అతి సమీపంలో పేడదిబ్బలు వేస్తున్నారనీ, వాటివల్ల నీరు కలుషితమై అంటువ్యాధుల బారిన పడుతున్నామని తహశీల్దార్ మాధవరాజు, ఎంపిడిఓ సుధాకర్‌లతో మొరపెట్టుకొన్నారు. విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. విమలమ్మ, పురుషోత్తమ్, గణేష్, శ్రీనివాసులు, ఉమారాణి, లావణ్య తదితరులు వినతిపత్రమందించిన వారిలో వున్నారు.

## అచ్చెన్నాయుడును కలసిన ఎస్కేఆర్

చౌడేపల్లి, డిసెంబర్ 19 ప్రభాతవార్త

రాష్ట్ర తేదేపా అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడును బోయకొండ మాజీ ఛేర్మన్, పురాతన దేవాలయాల పునర్నిర్మాణకర్త ఎస్కే వెంకట్రమణారెడ్డి కలిశారు. మంగళవారం విశాఖపట్టణంలోని తేదేపా కార్యాలయంలో ఆయన్ను కలిసినట్లు ఎస్కేఆర్ తెలిపారు. తేదేపా జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ముగింపు సభకు తనను ఆహ్వానించారన్నారు.

## దారి సమస్యను పరిష్కరించండి మహాప్రభో

చౌడేపల్లి, డిసెంబర్ 19 ప్రభాతవార్త



దారి సమస్య పరిష్కరించండి మహాప్రభో అంటూ తహశిల్దార్‌కు మొరపెట్టుకొన్నారు. బాధిత మహిళల కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోట హరిజనవాడ వాసులు పొలాలకు, మంచినీటిని తెచ్చుకోనేం దుకు దారివుండేదనీ, తరాలనాటి దారిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకొని కట్టడాలు నిర్మిస్తున్నారని మహిళలన్నారు. దారి సమస్య పరిష్కరించాలని తహశీల్దార్ మాధవరాజుకు వినతిపత్రమందించారు. విచారణ జరిపి చర్యలు తీసుకొంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. తులసి, అనూరాధ, లక్ష్మీదేవి, దీప, ఉషారాణి, వసంతమ్మ, నరసమ్మ తదితరులు వినతిపత్రమందించిన వారిలో వున్నారు.

## నాయిబ్రాహ్మణ యువతచే నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

కుప్పం, డిసెంబర్ 19 ప్రభాతవార్త



రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ వైద్యం శాంతారాం ఆదేశాలతో నియోజకవర్గ నాయీబ్రాహ్మణ యువత తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో వారు సమావేశమయ్యారు. బిసి భరోసా బాట కార్యక్రమం గురించి చర్చించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు జ్యోతీష్, సభ్యులు ఎల్లప్ప, లోకేష్, గంగరాజులు, మణి, మురుగేష్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, భరత్, వేదమూర్తి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బాలింత, గర్భిణీలకు దుస్తులు పంపిణీ

చిత్తూరురూరల్, డిసెంబరు 19 ప్రభాతవార్త:



శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు మాస మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో మెటర్నిటీ వార్డులో చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణీ స్త్రీలకు దుస్తులు పంపిణీ చేసారు. ముందుగా ఆసుపత్రిలోని ధన్వంతరీ గణపతి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గర్భిణీ స్త్రీలతో పాటు చిన్న పిల్లలకు దుస్తులు, బిస్కెట్స్, బ్రెడ్స్, పండ్లు, స్వామి వారి ఫోటో, విభూది ప్రసాదంను బ్యాగులో వుంచి అందజేసారు. ఈ సేవా కార్యక్రమంలో మహిళా సభ్యులురుక్మిణి, రత్నమ్మ, సేవాసమితి జిల్లా అధ్యక్షులు మదుసూదనం, కన్వీనర్ శేషనారాయణ, సేవాదళ్ సభ్యులు బద్రీ, గజేంద్ర,దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సుదేర్‌లాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థకు ఎంపికైన విజయం విద్యార్థులు

చిత్తూరురూరల్, డిసెంబరు 19 ప్రభాతవార్త:



ప్రముఖ బహుళ జాతి సంస్థ సుదేర్‌లాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థకు తమ కళాశాలకు చెందిన 6మంది విద్యార్థులు ఎంపికైనట్లు విజయం విద్యాసంస్థల అధినేత డా. ఎం. తేజోమూర్తి తెలిపారు. గత నెలలో తిరుపతి ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో వ్రాతపరీక్ష, మౌఖిలక పరీక్ష ప్రక్రియ నిర్వహించి నేడు తుది ఫలితాలను ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3లక్షల వార్షికవేతనం అందిస్తారన్నారు.

## విద్యార్థులు సైన్సుపై మక్కువ పెంచుకోవాలి

రొంపిచెర్ల, డిసెంబరు 19 ప్రభాతవార్త:



విద్యార్థులు నేటి సమాజంలో సైన్సుపై మక్కువ పెంచుకోవాలని ఎంఈఓలు ఇందిరా, శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్సుమేళా జరిగింది. ఈమేళాను వారు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ నమూనాలకు బహుమతులు పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థులు భవిష్యత్తులో మంచి శాస్త్ర వేత్తలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గానుగచింత, పెద్దమల్లెల, రొంపిచెర్ల బాలికల, ఉర్దూ, బొమ్మయ్యగారిపలె , ఆదర్శపాఠశాల, కేజీబీవి పాఠశాలల విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

రొంపిచెర్ల, డిసెంబరు19ప్రభాతవార్త

మండల పరిదిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో వీఆర్వోకు గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. రొంపిచెర్ల వీఆర్వోగా పని చేస్తున్న వెంకటరమన పీలేరు నుంచి ద్విచక్ర వాహనంలో రొంపిచెర్లకు వస్తుండగా బుసిరెడ్డిగారిపల్లె సమీపంలో మలుపు వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొన్నారు. ఈసంఘటనలో వెంకటరమణకు గాయాలైనాయి. ఆయనను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదేవిధంగా ఎదురుగా ఉన్న ద్విచక్ర వాహనంలోని గర్భవతిని కూడా పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## జిల్లా స్థాయికి మూడు నమూనాలు ఎంపిక

సదుం, డిసెంబరు 19 ప్రభాతవార్త



సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన మండల స్థాయి సైన్సు ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన మూడు నమూనాలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీరాములు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక విసయా లతో పాటు సైన్సు విసయాలపట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. సదుం, చెరకువారిపల్లె, పాలమంద, బూరగమంద, చెరకువారిపల్లె, బీసీగురుకుల పాఠశాలల విద్యార్థులు వివిధ రకాల సైన్సు ప్రయోగాలను ప్రదర్శించారు. వ్యక్తిగత అంశంలో బూరగమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్ణచంద్ర మొదటి బహుమతి సాధించగా, సామాజిక అంశంలో వినయ్, మహమ్మదరఫీ అనే విద్యార్థులు బీసీ గురుకుల పాఠశాల నుంచి ఎంపికైనారు. అదేవిధంగా ఉపాధ్యాయ విభాగంలో సదుం జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాలకు చెందిన దామోదర అనే ఉపాధ్యాయుడు జిల్లా స్థాయికి ఎంపికైనారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## తడలో దాడి.. ఇద్దరికి గాయాలు

తడ, డిసెంబర్ 19 ప్రభాతవార్త

తడ మండలం తడకండ్రిగ పోలీసు క్వార్టర్స్ వెనుక ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు, పాలా సింధుకు చెందిన ఇంటి నుంచి డ్రైనేజి నీళ్ల లీకవడంతో పొరుగింటి వారితో వివాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో పూజారి చెంగయ్య అతని భార్య పూజారి మంజుల కలిసి సింధుతో పాటు ఆమె చెల్లెలు ఇందుపై కూడా దాడి చేసి గాయపరిచారు. తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సూళ్లూరుపేటలో లాయర్ల నిరసన ర్యాలీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 19 ప్రభాతవార్త



సూళ్లూరుపేట పట్టణంలోని కోర్టు భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు లాయర్లు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. భూహక్కు చట్టం జీవోను వెనక్కి తీసుకోవాలంటూ తహశీల్దార్ రవికుమార్‌కు సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శనం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 512 భూహక్కుల చట్టం వల్ల సామాన్యులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఏదైనా ఆస్తులు వివాదంలో ఉంటే దాన్ని పరిష్కరించే అవకాశం, ఆస్తిపై పూర్తి హక్కును రెవెన్యూ అధికారులకు అప్పగించడం అన్యాయమని ఆయన విమర్శించారు. ఈ చట్టం ద్వారా సామాన్యులు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉందన్నారు.

## వరద బాధితులకు కిట్లు పంపిణీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 19 ప్రభాతవార్త




సూళ్లూరుపేటలో ఇటీవల మిచౌంగ్ తుపాను బారిన పడి ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజలకు నెస్ట్‌లే ఇండియా, జూనియర్ ఛాంబర్ వారి సంయుక్త సహకారంతో మంగ ళవారం కిట్లు పంపిణీ చేశారు. సుమారు 400 మందికి ఈ కిట్లు అందజేశారు. సూళ్లూరు, నాగరాజపురం ప్రాంతాల్లో ఉన్న వరద బాధితులకు తహశీల్దార్ రవికుమార్ చేతుల మీదుగా ఈ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెస్ట్‌లే ఇండియా సంస్థకు చెందిన వాసిం, జూనియర్ ఛాంబర్‌కు చెందిన మోడీ, అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి, భగవాన్‌దాస్, ఆలపాటి బాలాజి, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు నగదు పంపిణీ చేయాలి

కోట, డిసెంబర్ 19 ప్రభాతవార్త



తుపాను బాధితులకు ఈ నెలలో సంభవించిన తుపానులో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ నగదు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని వైకాపా నాయకులు మున్నెయ్య కోరారు మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామం లో అందరి ఇళ్లలోకి నీళ్ల వచ్చాయని, అధికా రులు కొందరికి మాత్రమే నిత్యావసర వస్తువు లు పంపిణీ చేశారని చెప్పారు. ప్రతి కుటుంబానికి నగదు, నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆయన ఎమ్మెల్యే వర ప్రసాద్‌రావు, గూడూరు ఆర్డిఒలను కోరారు. కేవలం గిరిజనలకు మాత్రమే నగదు, బియ్యం ఇచ్చారని ఎస్సీలకు ఇవ్వలేదన్నారు. ఇళ్లల్లోకి చాల మందికి నీళ్ల వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఒక వర్గానికి చెందిన వారికి పరిహారం ఇవ్వడంతో గ్రామంలో వివాదలు ఏర్పడుతున్నాయన్నారు.

## అయోధ్య కరసేవకులకు సన్మానం

కోట, డిసెంబర్ 19 ప్రభాతవార్త



మండల కేంద్రమైన కోటలో అయోధ్య కరసేవకులకు మండల భారతీయ జనతాపార్టీ మండల శాఖ అధ్యర్యంలో అధ్యక్షులు డాక్టర్, సారంగం రమేష్‌బాబు సన్మానం చేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ 1989,91 సంవత్సరంలో అయోధ్య ఉద్యమంలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కుటుంబాలను వదిలి ఆఉద్యమంలో కోట మండల నాయకులు సారంగం సురేష్‌బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసి జిల్లా ప్రధాన కార్యదర్శి, పోసిన శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబరీష్, మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాధవాసు, యువమోర్చాఅధ్యక్షులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కోటలో వైజ్ఞానిక ప్రదర్శన

కోట, డిసెంబర్ 19 ప్రభాతవార్త



కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ వైజ్ఞాన ప్రదర్శనను ఎంపిడివో మారెళ్ల భవాని, ఎంఇఒ మస్తానయ్యలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎంపిడివో భవాని మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతికను ఈ ప్రదర్శనలో తమ ప్రతిభ పాటలను ప్రదర్శించేందుకు ఈ వేదికలు ఏంతో ఉపయోగపడుతాయన్నారు. ఎంఇఒ మస్తానయ్య మాట్లాడుతూ ప్రదర్శన మూడు విభాగాలుగా నిర్వహిచండం జరిగిందన్నారు. విద్యార్థి వ్యక్తిగత ఎగ్జిబిట్‌లో జిల్లా పరిసరిషత్ వంజివాక, జెడ్పి. ఒకరు, కోట, జెడ్పిఒకరు, చిట్టేడు, జెడ్పి మరోకరు, ఒకరు, గ్రూప్ ఎగ్జిబిట్‌లో ఎపిటిడుబ్ల్యు, బాలికల చిట్టేడు, ఉపాధ్యాయ ఎగ్జిబిట్‌లో ఎం జయంతి, జెడ్పి చిట్టేడు, కె.సువర్ధన, జెడ్పి ఎస్‌కె. అనిష్ చిట్టేడు ముగ్గురును ఎంపిక చేశామని తెలిపారు. ఒక్క మండలం నుంచి తొమ్మిది మందిని తమ ప్రాజెక్టులను జిల్లా స్దాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎగ్జిబిట్స్ ప్రదర్శించే విధంగా ఎంపిక జరిగిందన్నారు. ఈనెల 22న జిల్లా కేంద్రంలో వైజ్ఞాన ప్రదర్శనకు వీరు పాల్గొంటారని ఎంఇఒ మస్తానయ్య తెలిపారు. విద్యార్దులు తయారు చేసిన పలు నమోనాలు ఎంతోగానో ఆకట్టుకున్నాయి

## తుఫాను బాధితులకు మద్దతుగా వైకాపా నాయకులు ఆందోళన

వాకాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త



మండల వైకాపా నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులు వరద బాధితులకు మద్ద తుగా, మంగళవారం తహశీ ల్దార్ కార్యాలయం ఆవరణంలో కి చేరుకున్న వైకాపా నాయకుల తో పాటు సీనియర్ రాజకీయ నాయకుడు, వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి, తహశీల్దార్‌తో మాట్లాడు తూ బాధితులకు తీవ్ర అన్యాయం జరిగింది. పరిహారం అందించడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైంది. తక్షణం బాధితులందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహశీల్దార్‌తో దామోదర్ రెడ్డి సంభాషించారు. జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్దామని తాను ఇక్కడ పరిస్థితిని కలెక్టర్ దృష్టికి వివరస్దానని తహశీల్దార్ ఎన్‌వి నరసింహారావుతో ఆయన అన్నారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కల్లూరు సర్పంచ్ విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను వచ్చి పది రోజులు పూర్తయిన ఇప్పటి వరకు పరిహారం అందజేయడంలో పూర్తిస్ధాయిలో దేవుని యంత్రాంగం విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఇకనైనా సంబంధించిన అధికారులు చొరవ తీసుకొని మిగిలిన బాధితులకు పూర్తి స్థాయిలో పరిహారం నాకు అందజేయాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహారావు, ఎంపిడివో గోపినాధ్, వైకాపా నాయకులు, సిబ్బంది ఉన్నారు. జెసిఎస్ కన్వీనర్ సుధాకర్ నాయుడు, ఏఎంసి డైరెక్టర్ జనార్ధన్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పార్లమెంట్ సమావేశాలల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

గూడూరు డిసెంబర్ 19 ప్రభాతవార్త



ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పట్టాలని గూడూరు నియోజక వర్గ అధ్యక్షులు వై.శ్రీనివాసులు కోరారు. మంగళవారం గూడూరు పట్టణంలోని ఆమేరకు గోడ పత్రిక ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 20 న కడప మున్సిపల్ గ్రౌండ్ నందు రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు అధ్యక్షతన మాదిగల రాజకీయ సమన్వాయ మహాసభకు జరుగుతుందని ఆసభకు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంపి స్దానాలతో పాటు ఎమ్మెల్యే సీట్లును కూడా అదే దమాషా ప్రకారం తమకు ఏవరు కేటాయిస్తారో వారికే రానున్న ఎన్నికల్లో మద్దతు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి, కండిగపాటి పొలు, కార్యదర్శి రవికుమార్, కృష్ణయ్య, శ్యామ్ ,సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

గూడూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త



స్దానిక సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం ఎంఆర్‌సి భవనం వద్ద ప్లెకార్డులతో ప్రదర్శన చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పిచాలని వారు డిమాండు చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదిన జీతాలు చెల్లించాలని కోరారు. సుప్రీమ్ కోర్డు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండు చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పదించి తమ న్యాయమైన డిమాండ్లు ను పరిష్కరించాలని వారు కోరారు.

## నారాయణ కళాశాలలో రక్తదాన శిబిరం

గూడూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త




గూడూరులోని నారాయణ కళాశాలలో మంగళవారం గూడరు సెంట్రల్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఆక్టివిటిస్ ,ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో రక్తదాన శిబింం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్నవారిని కాపాడువచ్చున్నారు. 120 మంది విద్యార్దులు రక్తం దానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విశ్వక్సెన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి కోటీశ్వరరావు ఏఓ, కోండారెడ్డి, అధ్యాపకులు విద్యార్దులు పాల్గొన్నారు.

## గూడూరులో కార్డన్ సెర్చ్

గూడూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త



యువకులు, రౌడీ షీటర్లు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం గూడూరులో చవటపాలెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో డిఎస్‌పి ఆధ్వర్యంలో ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్బంగా డిఎస్‌పి సూర్యానారాయణ రెడ్డి మట్లాడుతూ సరైన పత్రాలు లేని 22 బైకులు, ఒక ఆటోను స్వాదీనం చేసుకున్నామన్నారు. రెండు రోజుల క్రితం నెల్లూరులో డ్రగ్స్ కేసులో యువకులు పట్టబడ్డారని తెలిపారు. హైదరాబాద్‌లో గ్రడ్స్ కేసులో 12 మందిని అరెస్టు చేయగా అందులో ముగ్గురు యువకు లను గూడూరు కు చెందిన వారిగా గుర్తించారని పేర్కొన్నారు. ఈ కోణంలో కూడా విచాణ జరుపుతా మన్నారు. ఈకార్డన్‌సెర్చ్‌లో సిఐ హజరత్, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, ఎస్ఐ అంజిరెడ్డి పాల్గొన్నారు.

## కారుతో సహా కర్ణాటక మద్యం స్వాధీనం .. ఇద్దరు అరెస్ట్

కుప్పం, డిసెంబర్ 19 ప్రభాతవార్త



కుప్పం - పొగురుపల్లి మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారుతో సహా కర్ణాటక మద్యం పట్టుబడినట్లు సెబ్ సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు. గుడుపల్లె మండల o కనమనపల్లికి చెందిన గిరీష్, నారాయణ అనే వ్యక్తులు టాటా ఇండికా కారు (కెఎ03ఎఫ్3910)లో వస్తుండగా కారు తనిఖీ చేయగా 1632 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయన్నారు. కారు, మద్యంను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై రామూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భవతులు, చిన్నారులకు వైద్యపరీక్షలు

తొట్టంబేడు, డిసెంబర్ 19 ప్రభాతవార్త



జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం తొట్టంబేడు-2 సచివాలయ పరిధిలో ఉన్న రక్తహీనతతో ఉన్న గర్భవతులను, పాఠశాల విద్యార్థులకు, బడిబయట పిల్లలను గుర్తించి వైద్యపరీక్షలు చేశారు. అందరి వివరాలు డేటా ఎంట్రీలో ఆన్‌లైన్ రిపోర్టుకు రికార్డులు సరిపోయాయా? లేవా అని విచారించారు. అదేవిధంగా 0-1 సంవత్సరాల పిల్లలకు సంబందించిన వెకేషన్‌కు గురించి రికార్డులను తనిఖీచేశారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి సి.నాగేంద్రకుమార్, పిడిహెచ్ఎన్ఓ ఎ.బేబీరాణి, డిపిఓ ప్రకాష్, పిహెచ్ఎన్ రత్నాకర్, సిహెచ్ఓ సంపూర్ణమ్మ, ధనమ్మ, భారతీ, సుధా, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## వీధిని, గుడిని అక్రమించుకుంటూ ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారు!

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్),డిసెంబర్ 19 ప్రభాతవార్త



మండలంలోని కుమ్మరగుంట గ్రామంలో కొందరు రాముల వారి గుడి, గంగమ్మ రాయి, వీధిని విచ్చల విడిగా ఆక్రమించుకుంటూ ప్రశ్నించిన వారిపై తప్పుడు పోలీసు కేసులు బనాయిస్తూ గిరిజనులను భయభ్రాంతుల్ని చేస్తున్నారని వాపోతున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి. పాగాలి పంచాయతీలోని కుమ్మరగుంటలో 15 గిరిజన 15 ఎరుకల కుటుంబాలు నివసిస్తున్నారని బాధితులు వివరించారు. ఇక్కడ 40 సంవత్సరాలుగా రేకుల షెడ్డులో రాములవారి గుడి నిర్వహిస్తున్నట్లు వివరించారు. పక్కనే వేప చెట్టు పోలేరమ్మ పూజలు నిర్వహిస్తున్నామని కానీ సి .మణి అనే వ్యక్తి రాముల వారి గుడిని వీధిని ఆక్రమించుకుంటూ అడిగిన గిరిజనులపై, గ్రామస్తులపై కత్తులతో రాడ్లతో దాడి చేసి భయభ్రాంతుల్ని చేస్తున్నారని చెప్పులతో కొడుతున్నారని తమ బాధలను పత్రికలకు తెలిపారు.ఈ సమస్యకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు గ్రామానికి చేరుకొని దారికడ్డంగా వేసిన కంపను తొలగింపజేసారు. మరో సారి ఇలా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు గ్రామస్థులు వివరించారు.పోలీసులు గిరిజనులపై జరుగుతున్న దాడులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

## రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 19 ప్రభాతవార్త



రాష్ట్రీయ సేవాసమితి(రాస్) మరియు టాటా ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని టాటా ట్రస్టు, ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరాన్ని కొత్తపేటలో నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సబ్‌మేనేజర్ కిషోర్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రాస్ పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక క్రమశిక్షణతోపాటు పలు రకాలుగా సభ్యులకు, వారి కుటుంబసభ్యులకు విరివిగా ఆర్థికేతర కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమన్నారు. మనిషి జీవితం నేడు పని ఒత్తిడి, భారంతో యాంత్రికంగా మారడం వల్ల తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యంగా చూడడం వ్యాధి ముదిరితేతప్ప ఆస్పత్రికి వెళ్తున్నారని అలా కాకుండా ముందుజాగ్రత్తల వల్ల ఆరోగ్యాన్ని చూసుకోవచ్చన్నారు. రాస్‌ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యపరీక్షలకు టాటా ట్రస్టు సపోర్టు చేస్తుందన్నారు. ఈవైద్యశిబిరంలో మహిళలకు, పురుషులకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి అండ్ సి, నోటి కాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు సంబందించి అన్ని పరీక్షలను ఉచితంగా చేయించారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు బృందం రెడ్డికుమారి, మెహతాజ్, అమరావతి, అర్చన, బ్రాంచి ప్రాజెక్టు అధికారి వెంకటేష్, క్షేత్రస్థాయి అధికారులు వినోద్, సుబ్బారావు, స్వరూప, జోష్ణ, శబ్బు, మీనా, విజయలక్ష్మి, జయంతి, నాగలక్ష్మి, జయలలిత, క్లస్టర్‌లీడర్లు పాల్గొన్నారు.

## యువగళం ముగింపు సభకు శ్రీకాళహస్తి నేతలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 19 ప్రభాతవార్త



నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిసూచనల మేరకు యువగళం ముగింపు బహిరంగసభకు పట్టణం నుంచి విజయనగరంకు 1000మంది తెలుగుదేశం కుటుంబసభ్యులు శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయనగరంలో జరిగే సభకు పయనమయ్యారు. ఈసందర్భంగా వీరికి బొజ్జలబృందమ్మ మరియు బొజ్జలరిషితారెడ్డిలు జెండా ఊపి సభకు తరలివెళ్ళేవారిని సాగనంపారు.

## 22న జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన

శ్రీకాళహస్తి, డిసెంబర్ 19 ప్రభాతవార్త



జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 22న శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా సైన్సు అధికారి భాను ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆర్పీబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్డినేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శన ముఖ్యంగా మూడు విభాగాల్లో నిర్వహించినట్లు తెలిపారు. ఏ సబ్జెక్టు టీచర్ అయినా వారివారి ప్రదర్శనలు చేయించవచ్చన్నారు. విద్యార్థుల గ్రూప్ ప్రదర్శనలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. ప్రతి మండలం నుంచి విజేతలుగా ఎంపికైన తొమ్మిది మంది తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించేలా సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వరదయ్యపాలెంలో సిడిసిసి బ్యాంకులో ఉచిత సురక్ష భీమా

వరదయ్యపాలెం, డిసెంబర్ 19, ప్రభాతవార్త



వరద్యపాలెం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సిడిసిసి బ్యాంకులో సున్న అకౌంట్ ఖాతాను తెరచుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సురక్ష భీమా రెండు లక్షల రూపాయిలు వరకు 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వయసు వారికి ఉచితంగా బ్యాంకు వారు కల్పిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేసారు.

## తుఫానుకు మృతి చెందిన పశువులకు నష్టపరిహారం అందజేత

వరదయ్యపాలెం, డిసెంబర్ 19, ప్రభాతవార్త



వరదయ్యపాలెం మండలంలో రాచర్లకు చెందిన శైలజ, చిన్న పాండూరుకు చెందిన భాస్కర్, పెద్ద పాండూరుకు చెందిన ఎస్‌కె మాబులకు 37500 చొప్పున ఒక్కో రైతుకు తుఫాన్‌లో మృతి చెందిన పశువులకు నష్టపరిహారంగా జిల్లా పశు వైద్య అధికారి రవికుమార్ అందజేసారు. అలాగే సంత వేలూరు పరిధిలో మృతి చెందిన గొర్రెలకు సంబంధించి రైతులు సుబ్రమణ్యం, రమేష్‌లకు4వేలుచొప్పునపంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి గౌరీలు ఉన్నారు.

## యువగళం ముగింపు సభకు పాలసముద్రం టిడిపి నేతలు

పాలసముద్రం, డిసెంబర్ 19 ప్రభాతవార్త:



విజయగనరం జిల్లాలో జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సమావేశానికి పాలసముద్రం మండలం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్ళారు. తెలుగుదేశం పార్టీ ప్రభావశీలుర గుర్తింపు కమిటీ సభ్యుడు భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక రైలులో బయలుదేరి వెళ్ళారు. ముగింపు యువగళం పాదయాత్రకు బయలుదేరి వెళ్ళిన వారిలో మండల దేశం నాయకులు వాసునాయుడు, శేఖర్‌రాజు, విజయకుమార్, శీనురాజు, తంగరాజు, శబరివాసన్, ఏలుమలై, బాబు, చంద్రబాబు తదితరులు వున్నారు.

## తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు అధికారలకు సహకరించండి

ఓటర్ నమోదు అధికారి హరిత

తిరుపతి కార్పొరేషన్ , డిసెంబర్ 19, ప్రభాతవార్త



తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు అధికారులకు సహకరించాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత రాజకీయ పార్టీల నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల తుది జబితా వచ్చే నెల 5న వస్తుందని, ఇప్పటి వరకు డ్రాఫ్ట్ రోల్ పై అందిన ఫిర్యాదులు, అర్జీలను ఈ నెల 26 నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. అర్జీలు పెండింగ్ ఉన్న బిఎల్ఓ వారిగా సమీక్షించి ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు తమ వంతుగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఈడి టి. జీవన్,

## ఒక్క ఛాన్స్‌తో...ఇంత పన్నుల మోతా!

గంజి మాధవయ్య

పుత్తూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :



ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఎడాపెడా పన్నుల పెంచి ప్రజల నడ్డి విరిచిందని తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య విమర్శించారు. మంగళవారం రూరల్ మండలం పరిధిలోని కెబిఆర్ పురంలో జరిగిన భవిష్యత్‌కు గ్యారంటీ కార ్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. ఆఖరికి చెత్తపై కూడా పన్ను విధించిన ప్రభుత ్వం దేశంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు డి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.బాలాజీ, మాజీ అధ్యక్షుడు మోహన్‌రాజు, మాజీ సర్పంచ్ డి.సుబ్రమణ్యం, నాయకులు మహేష్, డి.వెంకటేష్, మునివేలు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువగళం ముగింపు సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు

పుత్తూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :



విజయనగరం జిల్లా భోగాపురంలో ఈ నెల 20వ తేదీన జరగనున్న యువగళం ముగింపు సభకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. రేణిగుంట నుంచి బయలుదేరిన ప్రత్యేక రైలులో వెళ్లారు. కార్యక్రమంలో పుత్తూరు పట్టణ, నింద్ర మండలాధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, పి.వెంకటేశ్వరరావు, విజయపురం, వడమాలపేట ప్రధాన కార్యదర్శులు బాబుయాదవ్, హేమావతి ఇంకా నాయకులు చిట్టిబాబు, కరుణ యాదవ్, జయచంద్ర, హరి, గుణభూషణమ్మ, నాగరత్న, మోహన, జి.బాబు, సోము తదితరులున్నారు

## అలరించిన వైజ్ఞానిక ప్రదర్శన

విజయపురం, డిసెంబరు 19 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన విజయపురంలో మంగళవారం మండల స్థాయిలో సైన్స్ ఎగ ్జబిషన్ నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రదర్శనలు ప్రదర్శించారు. విజేతలను ఎంపిక చేసి డివిజన్ స్థాయికి పంపనున్నట్టు ఎంఇఒ ఆంజనేయులు తెలిపా రు.ఎంఇఒ హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అంగన్వాడిల ధర్నా



విజయపురం, డిసెంబరు 19 ప్రభాతవార్త :

స్థానిక ఎంపిడిఒ ఆఫీసు ఎదుట నిర్వహిసు ్తన్న అంగన్వాడిల ధర్నా మంగళవారం కొనసాగింది. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ ధర్నా కొనసాగుతుందని, ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు స్పష్టం చేశారు.

## యువగళానికి తరలిన టిడిపి నేతలు

విజయపురం, డిసెంబరు 19 ప్రభాతవార్త :

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం సభకు మండలంలో టిడిపి నాయకులు మంగళవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, నాయకులు బాలసుబ్రమణ్యంరాజు, దశరధరాజు, రమేష్‌యాదవ్,మధునాయుడు,గాలిమురళీనాయుడు, గుణశేఖర్‌రెడ్డి, పరంధామనాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



నింద్ర,డిసెంబరు 19 ప్రభాతవార్త :

ఘనంగా మండల స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది.ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ దక్షణ భారతదేశ సైన్స్ పెయిర్‌లో భాగంగా పాఠశాల స్థాయి,మండల స్థాయి,జిల్లాస్థాయి,రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను విద్యాశాఖా నిర్వహిస్తున్నది.ఈపోటీలు వ్యక్తిగత స్థాయి,సమూహ స్థాయి,ఉపాధ్యాయుల స్థాయిలో నిర్వహించడం జరిగింది.ఈపోటీలో మొదటిస్థానంలో సెలక్టు అయిన వారు ఈనెల 22వతేది చిత్తూరు పట్టణంలో లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ నందు జిల్లా స్థాయి పోటీలకు హాజరు కాగలరు.ఉపాధ్యాయ స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్త ఆరూరు డి.అపరంజిరాజు,గ్రూపుస్థాయిలో సాయి శివప్రకాష్,ఇమ్మాన్యూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అత్తూరు,వ్యక్తిగత స్థాయి మహిమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చవరంబాకం వారు ఎన్నికైనారు.

## వైకాపాలో చేరిన 16వ వార్డు ముస్లింలు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం 16 వ వార్డుకు చెందిన మైనారిటి ముస్లింలు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకున్నారు.శబరిమల యాత్ర నుంచి తిరిగి వచ్చిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న యువకులు మాట్లాడుతూ 30 సంవత్సరాల్లో నియోజకవర్గంలో జరగని అభివృద్ధి నిరుపేదల పట్ల మానవత్వంతో వ్యవహారించే నాయకుడు, ఎప్పుడూ జనంలో ఉంటూ జనమే తన ఊపిరిగా వ్యవహారిస్తున్న ప్రజానాయకునికి రాబోవు ఎన్నికల్లో అండగా ఉండటం కోసం పార్టీలో చేరినట్లు వివరించారు.పార్టీలో చేరిన వారిలో సాధిక్ బాషా, అబ్దుల్ గఫూర్, జిహోని,వంశీ, ఖాదర్, షాకీర్,సమీర్,వహీద,సలీం తదితరులున్నారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తొట్టంబేడు మండల ఇన్‌చార్జి ఉన్నం వాసుదేవనాయుడదు, బోర్డు సభ్యులు భాస్కర్, 16వ వార్డు వైకాపా ఇన్‌చార్జి ఫజల్, జిమ్ కరిముల్లా, మాజీ మండలాధ్యక్షుడు కోవి చంద్రయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సిపాయి భరోసా అందజేత

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్),డిసెంబర్ 19 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం ఇసుక తాగేలి గ్రామానికి చెందిన మల్లికిత్తం చెంగముని కుటుంబానికి సిపాయి భరోసా ను అందించారు. మంగళవారం ఆయన చెంగముని కుమారుడు లక్ష్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆ కుటుంబాన్ని ఆదుకొనుటకు నిర్ణయించి తన అనుచరులతో గ్రామానికి చేరుకున్నారు.చెంగముని కుటుంబాన్ని పరామర్శించారు. వారికి సిపాయి భరోసా కార్యక్రమంలో భాగంగా 40 రకాల నిత్యావసర సరకులను అందించారు.ఆయనతో పాటు సర్పంచ్ గుర్రమ్మ, వైకాపా సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఎంపిటిసి కృష్ణవేణి, వైస్ సర్పంచ్ వనజాక్షి, బాలకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, మునిరెడ్డి, దామోదర్‌రెడ్డి, దశరధరెడ్డి, గోపి ప్రజలు పాల్గొన్నారు.

## ఏఐటియూసి తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం:

శ్రీకాళహస్తి,డిసెంబర్ 19 ప్రభాతవార్త



ఏఐటియూసి తిరుపతి జిల్లా మహాసభలు మూడు రోజుల పాటు శ్రీకాళహస్తిలో నిర్వహించారు. ఇక్కడి మహేష్ కళ్యాణ్ సదన్‌లో జరిగిన మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మంగళ వారం ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షులుగా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.రాధాకృష్ణను ఎన్నుకున్నారు.ఈ మేరకు పరిశీలకులు నాగసుబ్బారెడ్డి ఓ ప్రకటనలో తిరుపతి జిల్లా మహాసభలు మొదటి సారి పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు.ఈ మహాసభల్లో 16 తీర్మానాలు ప్రవేశ పెట్టి ఆమోదించామని తెలిపారు.నూతన కమిటి పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డిని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి వ్యవహారించినట్లు ప్రకటనలో తెలిపారు. మహాసభ 61 మంది కౌన్సిల్ సభ్యులు 17 మంది ఆఫీస్ బేరర్స్,ఇద్దరు ఆహ్వానితులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా ఎన్,చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కె.రాధాకృష్ణ, వర్కింగ్ అధ్యక్షుడుగా ఎన్.శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా పి.మురళి, సత్యానారయణ, నాగరాజమ్మ, గోవిందస్వామి, చాముండేశ్వరి, చంద్రబాబు సహాయ కార్యదర్శులుగా సిహెచ్ శివకుమార్, ఎన్‌డిరవి, ఎన్.శివ, వైయస్‌మణి, నాగేంద్ర,జాన్, ఉదయ్‌కుమార్, కోశాధికారిగా కే.వై.రాజా, ఆహ్వానితులుగా ధన్వంతకుమార్,మరో 44 మందిని వివిధ రంగాల నుంచి కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 19 ప్రభాతవార్త రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 20వార్డు కైలాసగిరి కాలనీలో పట్టణ అధ్యక్షులు విజయకుమార్, యూనిట్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, వార్డు అధ్యక్షులు బాబురెడ్డి, నాయకులు బూత్ ఇన్‌ఛార్జి మీర్జా, మహిళా అధ్యక్షురాలు సుమతి, రవీంద్రనాయుడు, బాలాజీ, హేమంత్, గోపిల ఆధ్వర్యంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైకాపా ప్రభుత్వంకు ప్రజలు బుద్దిచెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని ప్రజల కష్టాలు తీర్చాలంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈసందర్భంగా వార్డుల్లో ఉన్న సమస్యలను పలువురు ప్రజల దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వికసిత్ భారత్‌లో పేదలకు ఆయుష్మాన్‌భారత్ వైద్యపరీక్షలు

తిరుపతి, డిసెంబర్ 19ప్రభాతవార్త:



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన వికసిత్ బారత్ సంకల్పయాత్రలో భాగంగా పేదలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గురించి బిజెపి నాయకులు వివరిస్తున్నారు. యాత్రలో భాగంగా మంగళవారం ఉదయం నగరంలోని అన్నమయ్యకూడలిలో వికసిత భారత్ సంకల్పయాత్రను నగరపాలకసంస్థ సూపరింటెండెంట్,నోడల్ అదికారి రవి ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర,తిరుపతి జిల్లా నాయకులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు,అజయ్‌కుమార్,సామంచి శ్రీనివాస్ గుండాల గోపీనాథరెడ్డి, సవిత, జల్లిమధుసూదనరావు, నరేంద్రరెడ్డి, వేదవతిరాయల్, సుబ్రమణ్యంరెడ్డి,విజయకుమార్ తదితరులు పాల్గోని ప్రధాని మోదీ ప్రభుత్వంలో గత పదేళ్ళలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ఇక్కడ పేదలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి పలురకాల వైద్యపరీక్షలు చేయించారు.

## విద్యుత్‌ను ఆదా చేయండి : పాకాల డిఇఇ

పాకాల(తిరుపతి), డిసెంబర్ 19ప్రభాతవార్త:



విద్యుత్‌ను అవసరాల మేరకు వినియోగించి ,ఆదాచేయడంపై వినియోగదారులు దృష్టి సారించాలని ఎస్‌పిడిసిఎల్ పాకాల డిఇఇ నరేంద్ర పిలుపునిచ్చారు. విద్యుత్ పొదుపు చేసి భావితరాలకు మార్గదర్శకులుగా ఉండాలని ఆయన కోరారు. విద్యుత్ పొదుపు వారోత్స వాల్లో భాగంగా మంగళవారం పాలకమండలం దామలచెరువు జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాకాల ఏఇ జనార్ధన్‌రావు, ఎస్‌పిడిసిఎల్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గోన్నారు.

## తిరుపతి బాలోత్సవంలో బివికె పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ

తిరుపతి (క్రీడ), డిసెంబర్ 19, ప్రభాతవార్త



తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్ హథీరాంజీ కాలనీలో వున్న బివికె పాఠశాల విద్యార్థులు ఈ నెల 16, 17వ తేదీలలో జరిగిన తిరుపతి బాలోత్సవ కార్యక్రమంలో వివిధ రంగాలలో అనేక బహుమతులు గెలుచుకున్నారు. వరుసగా బి. మనోజ్ కుమార్ (ప్రథమ స్థానం - సంగీత వాయిద్యం), లలన్ రాజ్ (తృతీయ స్థానం - శాస్త్రీయ నృత్యం), కె. కోషిన్ సాయి - (తృతీయ స్థానం - బెస్ట్ ప్రమ్ వేస్ట్), బెన్ని కృష్ణ హస్మిత (ప్రథమ, ద్వితీయ స్థానాలు - తైక్వాండో) ఇటు చదువు, అటు ఆటలలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆ విద్యార్థులను పాఠశాల సిఇఓ అలేఖ్య రెడ్డి అభినందించారు.ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతరబృందంవిద్యార్థులను ప్రశంసించారు.

## రాష్ట్ర స్థాయి త్రోబాల్ జిల్లా జట్టుకు అభినందనలు

తిరుపతి (క్రీడా), డిసెంబర్ 19, ప్రభాతవార్త

విజయవాడలో 20న జరుగు రాష్ట్ర స్థాయి జూనియర్ త్రోబాల్ చాంపియన్షిప్‌లో పాల్గొన్న చిత్తూరు జిల్లా జూనియర్ బాలబాలికలు జట్లకు అభినందనలు తెలిపారు. జెన్ అకాడమి అండ్ జిల్లా జూడో సంఘం అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భానుప్రకాష్ రెడ్డి, కార్యదర్శి చీనేపల్లి కరుణ్ కుమార్, ఈ నెల 14న జిల్లా త్రోబాల్ జట్టు ఎంపిక తిరుపతి కేంబ్రిడ్జ్ స్కూల్ నందు జరిగింది. వీరికి కేంబ్రిడ్జ్ స్కూల్ నందు పిఈటి మురళి ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించడానికి అనుమతిచ్చిన కేంబ్రిడ్జి స్కూల్ కరస్పాండెంట్ కల్పన రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వసుబాలలకు ధన్యవాదాలు తెలిపారు. జట్లకు కోచ్ కిరణ్, పిఈటి మురళి, మేనేజర్లుగా పిఈటి విశ్వానాథ్, సురక్షలు ఎంపికైన బాలికలు మోక్షిత, రజియా, వరలక్ష్మి, నక్షత, నిక్కత్, తన్వి, శశిరేఖ, యషిత, దివ్యశ్రీ, బిందుశ్రీ, భువనేశ్వరి, వైష్ణవి, శాన్విత, బాలురు నిశ్చల్, అబ్దుల్ అజీజ్, అతీఫ్, ఆసిఫ్, జీవన్, ప్రవీణ్ కుమార్, చరణ్, చరితార్థ్, జగదీష్, సూర్యప్రతాప్ రెడ్డి, రాంచరణ్ తేజ, రోహిత్, వినయ్ తదితరులు ఎంపికైయ్యారు.

## అంగన్‌వాడీల సమస్య .. జగన్ రెడ్డి స్పందిస్తేనే పరిష్కారం

ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి, డిశంబర్ 19 ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల సమస్యపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి స్పందిస్తేనే పరిష్కారం లభించగలదని ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల శిబిరం వద్దకు చేరుకున్న ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ దీక్షలో బైఠాయించారు. సిఎం స్పందించి సుప్రీం కోర్టు తీర్పు మేరకు అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సిఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అదే జగనన్న లక్ష్యం

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి, డిశంబర్ 19 ప్రభాతవార్త:



ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అదే ముఖ్యమంత్రి వై.ఎస్.జన్మోహన్ రెడ్డి లక్ష్యమని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎం.కొత్తపల్లిలో మంగళవారం ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన హర్షిత్ రెడ్డి ముందుగా కోదండరామాపురంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు జరిపించి, గ్రామస్థుల ఘన స్వాగతం అందుకున్నారు. విద్య, వైద్య రంగాలకు విశేష ప్రాధాన్యత కల్పిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మా తండ్రి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆశీస్సులతో ఎంఎల్ఏగా పోటీచేస్తున్న మా అన్నయ్య తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

## సమర్ధవంతంగా "వైఎస్ఆర్ జాబ్ మేళా"

33 మల్టీ నేషనల్ కంపెనీలు, 3500 ఉద్యోగాలు

నిరంతర పర్యవేక్షణకు 9 కమిటీలు

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి, డిశంబర్ 19 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించతలపెట్టిన వైఎస్ఆర్ జాబ్ మేళా సమర్థవంతంగా నిర్వహించాలని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. స్థానిక బాయ్స్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు ఇక్కడికి చేరుకున్న ఆయన వేలాధిగా తరలిరానునన్న నిరుద్యోగ యువతను పర్యవేక్షించేందుకు 9 కమిటీలను ఏర్పాటు చేశారు. 33 మల్టీనేషనల్ కంపెనీలు నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో 3500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్ వైసిపివిద్యార్థివిభాగంమండలఅధ్యక్షుడు సూరి, మైనార్టీ నాయకులు బహార్, సిద్ధిఖ్ భాషా, పాల్గొన్నారు.

## సనాతన సాంప్రదాయానికి శ్రీకారం

రేణిగుంట, డిసెంబరు 19 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం గాజులమండ్యంలో చోళరాజుల కాలం నాటిదిగా చెప్పబడుతున్న శ్రీ కామాక్షి సమేత శ్రీ మూలస్థానేశ్వర దేవాలయంలో సనాతన, ప్రాచీన సంప్రదాయమైన నగర సంకీర్తనకు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం శ్రీకారం చుట్టినట్లు ఆలయ నిర్వాహకుడు జువ్వల ధనంజయరెడ్డి తెలిపారు. ప్రాచీన సనాతన హైందవ సాంప్రదాయాలు, కళలు, కనుమరుగైపోతున్నాయన్నారు. పూర్వం ధనుర్మాసాన్ని పండుగ నెల భావించినెలంతా రథసప్తమి వరకు ఇళ్ళ ముంగిళ్ళ ముందు గోమయంతో కల్యాపి చల్లి వైకుంఠ ద్వారాలతోకూడిన రంగవల్లులు వేసే వాటిపై గుమ్మడి పూలతో అలంకరించిన గొబ్బెమ్మలను పెట్టే వారన్నారు. అప్పట్లో నగర సంకీర్తన ద్వారా భక్తి పాటలను భజన చేస్తూ గ్రామాల్లో నగరాల్లో తిరిగి ప్రజల్లో భక్తి భావన కలిగేలా చేసే వారన్నారు. ఆ సంకల్పంతో శ్రీ కామాక్షి సమేత శ్రీ మూలస్థానేశ్వర దేవాలయం నుంచి గ్రామంలో నగర సంకీర్తన చేస్తున్నట్లు తెలిపారు.

## శ్రీశక్తి పీఠంలో టిటిడి చైర్మన్ భూమన

రామచంద్రాపురం, డిశంబర్ 19 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠాన్ని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం సాయంత్రం సదర్శించారు. కుర్తాళం పీఠాధిపతి, శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకులు పరమాచార్యులు శ్రీసిద్ధేశ్వరానంద మహాస్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. శ్రీశక్తి పీఠాధీశ్వరీ మంత్ర మహేశ్వరీ శ్రీ రమ్యానందభారతితో కలసి శ్వేతవారాహిదేవి, మరకతశక్తి కాళీదేవిలను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మునికృష్ణయ్య, మేనేజర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే జైలు శిక్ష

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్**




చిత్తూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, దీనిని ఉల్లంఘిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. డిఆర్‌డిఎ సమావేశ భవనంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ పిసి అండ్ పిఎన్ డిటి చట్టం, స్త్రీల హక్కులపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, జిల్లా సంక్షేమశాఖల అధికారులు డాక్టర్ రాజ్యలక్ష్మీ, రబ్బానీ భాషా, డిఐఓ డాక్టర్ రవిరాజు, దిశ ఎస్ఐ నాగసౌజన్య, స్వయం సహాయక సంఘాల మహిళలు, వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ గర్భధారణ సమయంలో జన్యు సంబంధమైన వ్యాధులు కనుక్కొవడానికి స్త్రీకి రెండు సార్లు, అంతకన్నా ఎక్కువ సార్లు గర్భస్రావం లేదా పిండ నష్టం లాంఛ ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే అల్ట్రా సౌండ్ స్కాన్ చేయాల్సి వుంటుందన్నారు. చట్టాలను ఎవరైనా ఉల్లంఘిస్తే మొదటి సారి 3 సంవత్సరాలు, 10 వేల రూపాయలు జరిమానా, 2వ సారి నేరం చేస్తే 5 సంవత్సరాలు జైలు శిక్ష, 50 వేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. డిఎం హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ఆడబిడ్డలను రక్షించాల్సిన బాధ్యత వుందన్నారు. డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ మహిళలు వారు నివాసం వుంటున్న ప్రాంతాల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారి దృష్టికి వస్తే జెండర్ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ ఆడ పిల్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందని, ఆడపిల్లలు చదువులో రాణించడానికి పూర్తి సహకారం అందించాలన్నారు.

## రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా పియానో అందజేత



నగరి, డిసెంబరు 19 ప్రభాతవార్త: సంగీత వాయిద్య కళాకారుడు నారాయణకు మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ఫియానోను అందజేశారు. కడప జిల్లా నబికోటకు చెందిన కె.నారాయణ తన వద్ద ఉన్న ఫియానో ద్వారా పలువురికి సంగీత పాఠాలు నేర్పుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ జీవనోపాధి కొనసాగించేవాడు. అతని వద్ద ఉన్న ఫియానో మరమ్మతులకు గురికావడంతో జీవనోపాధి కుంటుపడింది. కొత్తగా ఫియానో కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా ద్వారా మంత్రి రోజాను కలసిన సమయంలో తన పరిస్థితినఇ ఆమెకు వివరించాడు. మంగళవారం తన స్వగృహానికి నారాయణను రప్పించిన మంత్రి కొత్త ఫియానోను అతనికి అందించారు. రాజకీయాలకు అతీతంగా తన మానవత్వాన్ని చాటుకున్నారు. మంత్రి రోజాకు కళాకారుడు నారాయణ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ ఉద్యోగులకు అదనపు బాధ్యతలు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలనా సౌలభ్యం కోసం పని చేస్తున్న ఉద్యోగులకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఆలయ ఇఒ కె.యస్ రామారావు మంగళ వారం ఉత్తర్వులు జారి చేసారు.ఎఇఓ బిఎల్ఎన్ ప్రసాద్‌కు అడిషనల్‌గా అకౌంట్స్‌ను అప్పగించారు. బి.కళ్యాణి సూపరింటెండెంట్‌కు అడిషనల్ గా స్టేషనరి, ఎంవి ఫారాలు, స్టోర్స్ మరియు టిఎంఎస్ బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారి చేసారు.సూపరింటెండెంట్ టి.రవికి ఆదనంగా గోశాల భాధ్యత అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ పి.రాజశేఖర్‌కు సూపర్‌వైజర్ శానిటేషన్‌ను అప్పగించారు. సినియర్ అసిస్టెంట్ డి.లావణ్యకు అదనంగా అకామడేషన్ డోనర్స్ సెల్ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ కే.మహేష్ ఆడిట్ అభ్యంతరాలు,ఇన్‌కంటాక్సు మరియు జిఎస్‌టి జూనియర్ అసిస్టెంట్ యోగేష్ పేబిల్స్ ఎస్ఆర్ఎస్ నిర్వహణ,ఎం.దామోదరానికి అదనంగా క్యాషియర్, కాంటాక్టు వర్కర్ ఎస్ నరసింహులు పార్కింగ్ ఫీజులు గాలిగోపురం వద్ద వసూలు, బి.సుబ్రమణ్యం పొన్నాలమ్మగుడి వద్ద పార్కింగ్ ఫీజుల వసూలు, అవుట్ సోర్సింగ్ శివయ్యకు పబ్లికేషన్ స్టాల్‌ను అప్పగించారు.

## మారథన్ పరుగు పందెంలో శ్రీకాళహస్తి వాసి ప్రతిభ



శ్రీకాళహస్తి,డిసెంబర్ 19 ప్రభాతవార్త : అజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ వైజాగ్ బీచ్‌లో నిర్వహించిన పోటీల్లో శ్రీకాళహస్తి వాసి తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి మూడవ బహుమతిని సాధించి శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింప జేసారు. వైజాగ్‌లోని బీచ్‌రోడ్డులో నోవాటెల్ హోల్ వద్ద నిర్వహించిన 10కిమీల పరుగుపందెములో కె.రమణారెడ్డి (57) విశేష ప్రతిభ కనబరిచి మూడవ బహుమతి సాధించారు. 55-64 వయస్సు పోటీల్లో రమణారెడ్డి 10కిమీల పరుగు పందెములో 53 నిముషాల్లో గమ్యం చేరుకొని విజేతగా నిలిచారు. రమణారెడ్డి శ్రీకాళహస్తిలోని నిత్యాఫిట్‌నెస్ కేంద్రంలో మారథాన్ పై శిక్షణ పొందారు. నిర్వాహకులు జ్యోతిరావు వైజాగ్ పోటీలకు రమణారెడ్డిని తీసుకెళ్ళినట్లు వివరించారు.విజేత రమణారెడ్డిని శ్రీకాళహస్తి వాసులు సత్కరించారు.

## స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి కాలం పొడగింపు

గూడూరు,డిసెంబర్ 19 ప్రభాతవార్త : స్వచ్ఛఆంధ్రకార్పొరేషన్ చైర్‌పర్సన్ పోణకా దేవసేనమ్మ పదవీ కాలాన్ని ప్రభుత్వం తదుపురి ఉత్తర్వులు వచ్చే వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగామని సిఎం ఆదేశాలతో అధికారులు జీవో జారి చేశారు.ఈ సందర్భంగా దేవ సేనమ్మ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి: హరిత



తిరపతి కార్పొరేషన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త : స్మార్ట్ సిటి నిధులతో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటి ఎండి హరిత కోరారు.మంగళవారం స్థానిక నగరపాలక అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. ఆమె మాట్లాడుతూ పాత మున్సిపాల్ కార్పొరేషన్ స్థలంలో నిర్మిస్తున్న సిటి ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు తదితర నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంజనీర్లు సంస్థ ప్రతినిధి బాలాజీ ఏఏఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 8వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



రేణిగుంట, డిసెంబరు 19 ప్రభాతవార్త: రేణిగుంట పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ హెల్పర్లు, కార్యకర్తలు చేస్తున్న నిరసన సమ్మె మంగళవారానికి 8వ రోజు చేరుకుంది. ప్రభుత్వం తమ న్యాయసమతమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సరోజనమ్మ(55) తీవ్ర అస్వస్థతకు గురైంది. సమ్మెలోఉన్న అంగన్‌వాడీలు ఆమెకు గుండెపోటు వచ్చిందని చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. సమ్మె చేస్తున్న వారికి ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మణి, మండల కార్యదర్శి కార్తీక్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర, బిల్డింగ్స్ జిల్లా కార్యదర్శి చిన్న, ఆవాజ్ మండల నాయకులు దిలీప్ బాషా, కేవీపీఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్, సంఘ మిత్రలు మండల కార్యదర్శి లక్ష్మి, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఓ.వి.రమణ, సీఐటీయూ మండల కార్యదర్శి హరినాథ్, తదితరులు తమ మద్దతు తెలియజేశారు.

## సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో చంద్రగిరి ప్రతిభ



చంద్రగిరి, డిశంబర్ 19 ప్రభాతవార్త: సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో చంద్రగిరి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా రాణించి నట్లు ఎంఈఓ శ్రీవరం లలితకుమారి తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వారి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సైత్ ఇండియా సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. ఇందులో వ్యక్తిగత ఎగ్జిబిట్స్, గ్రూప్ ఎగ్జిబిట్స్, ఉపాధ్యాయ ఎగ్జిబిట్స్ మూడు విభాగాలలో ఈ సైన్స్‌ఫెయిర్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో వ్యక్తిగత విభాగం నుండి నరశింగాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.యవన్ కృష్ణ, ఏ.రంగంపేట జడ్పీ హైస్కూల్ సి.భరత్, చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.సుహేల్ విజేతలుగా నిలిచారు. అదేవిధంగా గ్రూప్ వింగ్‌లో చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్.చైతన్య, ఎన్.రషీద్ భాషా, నరశింగాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి సి.దేవహర్ష, ఓ.మోహిత్, తొండవాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థి వి.విశాల్, వి.శ్రీనివాస రావు విజేలుగా రాణించారు. అదేవిధంగా ఉపాధ్యాయ విభాగంలో నరశింగాపురం జడ్పీ హైస్కూల్ ఎస్.కోదండపాణి ఎస్ఎ, (పిఎస్) విజయం సాధించినట్లు తెలిపారు. ఈ నెల 22న శ్రీకాళహస్తిలోని జడ్పీ హైస్కూల్లో జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనకు చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల పాల్గొంటారని అన్నారు. అనంతరం విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 భాస్కర్ బాబు, హెచ్ఎం విజయ, జిల్లా అకడమిక్ సైన్స్ కోఆర్డినేటర్ కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

## 22 నుండి వైకుంఠ ద్వార దర్శనం ఉచిత టోకెన్ల జారీ

**9 ప్రాంతాల్లోని కౌంటర్లను తనిఖీ చేసిన జేఈఓ సదాభార్గవి**

తిరుపతి మహిళావర్సిటీ, డిసెంబర్ 19 ప్రభాతవార్త : తిరుమల శ్రీ వారి ఆలయంలో డిసెంబరు 23 నుండి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వారా దర్శనానికి సంబంధించి డిసెంబరు 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 90 కౌంటర్ల ద్వారా సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు మంజూరు చేస్తామని టిటిడి జేఈఓ సదాభార్గవి తెలిపారు. కౌంటర్లను మంగళవారం ఆమె తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్ రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎంఆర్‌పల్లిలోని జడ్‌పి హైస్కూల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కౌంటర్లలో 4 లక్షలకు పైగా సర్వదర్శనం టోకెన్ల కోటా పూర్తయ్యేవరకు మంజూరు చేస్తామని వెల్లడించారు. టికెన్లు, టికెట్లు పొందిన భక్తులను 24 గంటలు ముందు మాత్రమే తిరుమలకు అనుమతిస్తామన్నారు. దర్శన టోకెన్లు ఉన్న వారిని మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని, టోకెన్లు లేని భక్తులు తిరుమలకు వెళ్లవచ్చు గానీ దర్శనానికి అనుమతించబడరని, ఈ విషయాలను కౌంటర్ల వద్ద అనౌన్స్‌మెంట్ చేస్తామని చెప్పారు. జేఈవో వెంట ఎస్ఈలు శ్రీ సత్యనారాయణ, శ్రీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, సుబ్రమణ్యం, ఐటి జిఎం సందీప్, అదనపు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఎవిఎస్వో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ సెక్రటరితో ఎమ్మెల్యే తుపాన్ సమస్యలపై బేటి



గూడూరు,డిసెంబర్ 19 ప్రభాతవార్త: గూడూరు నియోజకవర్గంలోని వాకాడు మండలంలోని బాలిరెడ్డి పాళెం గ్రామంలో తుపాన్ వల్ల నష్ట పోయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకొవాలని గూడూరు శాసన సభ్యులు వరప్రసాద్‌రావు మంగళవారం విజయవాడులోని చీఫ్ సెక్రటిరి జోహర్‌రెడ్డిని కలిశారు. ఆమేరకు తుపాన్ మంపు ప్రభావ ప్రాంతాలకు సిఎం వచ్చారని ప్రసాద్‌రావు వివరించారు. ఆమేరకు సిఎం ఒక్కొక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ 2500 ఇవ్వాలని సిఎం ఆదేశించారని తెలిపారు. అయితే గ్రామాల్లో పంపిణీ సిఎం చెప్పిన విధంగా జరగడం లేదని తెలిపారు. దీంతో గ్రామాల్లో వివాదాలు జరుగుతున్నాయన్నారు. కోట మండలంలో వెంకనపాళెంలో గర్భకండ్రిగ లో ఆంక్షలు వలన రైతలు ఇబ్బందులు పడుతున్నారని సెక్రటిరి ప్రభాకర్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకుళ్లారు.

## గణనాధుని సేవలో అపోలో చైర్మన్ పీసీ రెడ్డి



కాణిపాకం, డిసెంబర్ 19 ప్రభాతవార్త: అపోలో హస్పిటల్స్ ఛైర్మన్ పద్మభూషన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి కుటుంబసమేతంగా మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ప్రముఖ వ్యాపారవేత్త అరగొండ పూర్ణ చంద్రారెడ్డి, చిత్తూరు అపోలో మెడికల్ కాలేజి ఇన్‌చార్జి నరేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌తో పాటు అపోలో సిబ్బంది పాల్గొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి దేవస్థానం ఛైర్మన్ పి.సురేంద్రరెడ్డి, అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## కాణిపాకం ఆలయానికి 3 లక్షలు విరాళం



కాణిపాకం, డిసెంబర్ 19 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు మంగళవారం 2 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు ఈమేరకు హైదరాబాద్ నిజాంపేటకు చెందిన ఎం.మనోజ్‌కుమార్ అనే భక్తుడు దేవస్థానంలో అమలవుతున్న సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు శాశ్వత 2,00,016 రూపాయలు, నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## విజయోత్సవ సభకు భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు



చిత్తూరురూరల్, డిసెంబరు 19 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు విజయోత్సవ సభకు భారీగా ప్రజలు వెళ్లడానికి తెలుగు దేశం పార్టీ సీనియరు నాయకులు, జిజెఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్ ప్రత్యేక రైలును ఏర్పాటుచేసారు. రైలుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిజెఎం ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్న కేశవనాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పీటర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లం దీపిక రెడ్డి ఉత్తమ సేవలకు గవర్నర్ అవార్డు

**తొండవాడలో జల్‌జీవన్ మిషన్ విజయవంతం**




చంద్రగిరి, డిశంబర్ 19 ప్రభాతవార్త: తొండవాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లం దీపిక చంద్రమౌళిరెడ్డి అందించిన ఉత్తమ సేవలకు జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో ఇంటింటికీ మంచినీటి కొళాయి కనెక్షన్ ఇవ్వడంలో సర్పంచ్ దీపిక రెడ్డి విజయవంతంగా పనిచేశారు. సర్పంచ్ తన భర్త, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి సహకారంతో జల్ జీవన్ మిషన్ విజయవంతం చేశారు. దీంతో అవార్డు వరించగా గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆమె పంచాయతీ ప్రజలకు మరింతగా సేవలందించడంలో ఈ అవార్డు ప్రోత్సహిస్తుందన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు



రేణిగుంట, డిసెంబరు 19 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఘనంగా వీడ్కోలు లభించింది. తిరుపతి, తిరుమల రెండు రోజుల పర్యటన ముగించుకుని రోడ్డు మార్గాన కట్టుదిట్టమైన భద్రత నడుమ రేణిగుంట రైల్వేస్టేషన్ చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌లో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, శ్రీ పద్మావతి విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ భారతి, తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, రైల్వే డీఎస్పీ షాను, తహసీల్దార్ ఉదయ సంతోష్, పలువురు రెవెన్యూ, రైల్వే అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన దురంతో ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

## క్రీడల్లో అపుడూ...ఇపుడూ పుంగనూరే టాప్..

**-డాక్టర్ శరణ్ ప్రశంసలు**



పుంగనూరు,డిసెంబరు 19 ప్రభాతవార్త : దేశంలో ఏడు దశాబ్దాలక్రితమే క్రీడల్లో పుంగనూరు టాప్‌గా నిలిచిందని, ఇపుడు కూడా అదే జోష్ అన్ని క్రీడల్లో నూ సాధిస్తుండడం ఎంతో గర్వకారణమని ప్రభుత్వ వైద్యశాల ఛైర్మన్ డాక్టర్‌శరణ్ కుమార్, ఎస్ఎస్ గ్రాండ్ అధినేత అప్‌టెక్ హరి ప్రశంసిం చారు. కొత్త ఇండ్లలోని షిర్డిసాయి మందిరంలో మంగళవారం జరిగిన కరాటే మాస్టర్ రెడ్డిమహేష్ అభినందన సభలో వారు మాట్లాడారు. డాక్టర్ శరణ్‌కుమార్ మాట్లాడుతూ డెబ్బై ఏళ్ళక్రితమే పుంగనూరులో టెన్నికాయిట్‌లో దక్షిణభారత స్థాయి ఛాంపియన్ షిప్‌ను శ్రీనివాసపురం వేణుగోపాల్ సాధించారన్నారు. ఎస్ఎస్ గ్రాండ్ అధినేత అప్‌టెక్‌హరి మాట్లాడుతూ, వాలీబాల్ రంగంలో దివంగత అక్కింగోవిందప్ప, నేటి విశ్రాంత డిఎస్పీ కనుమకుంట సుకుమార్‌బాబు, కబడ్డీలో పిఇటి రామచంద్ర లాంటి మెరికల్లాంటి క్రీడాకారులు పుంగనూరుకు వన్నె తెచ్చారన్నారు.వరల్డ్ కరాటే మాస్టర్స్ ఎక్సెలెన్సీ అవార్డు సాధన వెనుక రెడ్డిమహేష్ కృషిని అభినందించారు. పుంగనూరు ఆధ్యాత్మిక ప్రచారవేత్త,కొత్తఇండ్లుసాయిటెంపుల్ కన్వీనర్ త్రిమూర్తిరెడ్డి మాట్లాడుతూ గ్రామగ్రామానా క్రీడాభివృద్దికి తాము సహాయపడుతామన్నారు. జిల్లా కరాటే అధ్యక్షుడు సుధాకర్,భాస్కర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి,నవీన్‌కుమార్‌రాజులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : జడ్పీ సీఈఓ

సదుం, డిసెంబరు 19 ప్రభాతవార్త : మండల పరిదిలో జరుగుతున్న అభివృద్ది పనులు వేగవంతం చేయాలని జడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిసత్ కార్యాలయం ఆవరణలో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. సదుంలో నియోజకవర్గ స్థాయి సమీక్షల కొరకు నిర్మిస్తున్న భవనాన్ని సందర్శించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మదనపల్లె పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖరరెడ్డి, సదుం పిఆర్ డిఈ మురళీ, ఎంపీడీఓ వరప్రసాద్, జడ్పీటీసీ సోమశేకరరెడ్డి,సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, మండల వైకాపా కన్వీనరు రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం




వెదురుకుప్పం, డిసెంబర్ 19 ప్రభాత వార్త : పర్యావరణ పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన అవసరమని వైఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద పేర్కొన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఆవరణంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ వాలంటీర్ల ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం వలన వ్యాధులు దూరం చేయవచ్చున్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత గురించి చిన్న చిన్న చర్యల ద్వారా ఎలా మార్పుతీసురావచ్చు అంశాలను వివరించారు.అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణంలోగల పిచ్చిమొక్కలు తొలగించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మంగళగౌరీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశు, అకాడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు శంకర్ రెడ్డి, లావణ్య కుమారి, భరణినాథ్ రెడ్డి, బాబు, భీమమోహన్‌రావు, ఎల్‌యండి భక్షు, అరుణ, ఇస్మాయిల్, శ్రీనివాసులు, నరేంద్ర బాబు, సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరంకు భారీగా తరలిన తెలుగుతమ్ముళ్లు



కుప్పం, డిసెంబర్ 19 ప్రభాతవార్త : తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం విజయోత్సవ సభలో పాల్గొనేందుకు కుప్పం నియోజకవర్గంనుంచి తెదేపా శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కుప్పం, కుప్పం మున్సిపల్, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన నేతలు, కార్యకర్తలు చిత్తూరు రైల్వేస్టేషన్‌కు భారీగా చేరారు. అక్కడ నుంచి విజయనగరం వరకు ఏర్పాటుచేసిన ప్రత్యేక రైలులో వీరు పయనమయ్యారు. ఈసందర్భంగా జై చంద్రబాబు, జైలోకేష్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా

**వైఎస్ఆర్‌సిపి చేనేత విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ**



వెంకటగిరి, డిసెంబర్ 19 ప్రభాతవార్త: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చేనేత విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాద జానకి రామయ్య తెలిపారు. జానకి రామయ్యను నెల్లూరు జిల్లా పద్మశాలి సంఘం వారు ఘనంగా సన్మానించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తనకు ఈ పదవి ఇప్పించారని తనపై ఉన్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పని చేస్తానని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుని రాంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. చేనేత కార్మికుల అభివృద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీయర్ పద్మాశాలి సంఘాల నాయకులు కొప్పర్తి హరినాథ్, పద్మశాలి సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గుత్తి కొండ శ్రీనివాసులు , ప్రధాన కార్యదర్శి వింజమూరు వెంకటేశ్వర్లు, రాష్ట్ర పద్మశాలి యువసేన సంఘం నాయకులు మునగపాటి రమేష్, గుత్తికొండ వెంకటయ్య, చొప్ప మురళి, పెండ్యం శీను, కోలాటి రాజేష్, దోనిపూడిహరి, తదితరులు పాల్గొన్నారు.

## ఈవియం, వివి ప్యాట్‌ల పట్ల ప్రజలకు అవగాహన

**ఓటరు నమోదు అధికారి, కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త : రాబోవు ఎన్నికల్లో ఈవిఎం, వివి ప్యాట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. ఈవియం, వివిప్యాట్ల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఈవిఎం ప్రదర్శన వాహనాన్ని మంగళవారం కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియలో మూడు మెషిన్లు ప్రథమంగా ఉంటాయని మొదటిది ఈవీఎం అంటే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్, ఎంత మంది అభ్యర్థులు పోటీ చేయుచున్నారు. వాళ్ల ఎన్నికల గుర్తులతో వరుస సంఖ్యలో ఒకటి నుంచి 16 వరకు ఉంటాయని, రెండవది వివి ప్యాట్ అనగా ఓటర్ వెరిఫైబుల్ పేపర్ అడిట్‌ట్రయిల్, దీని ద్వారా ప్రజలు వారు ఎవరికి ఓటు వేశారో డిస్ప్లేలో చూసుకోవడమే కాకుండా పేపర్ ద్వారా కూడా వారు ఎవరికి ఓటు వేసారో వీవీపీఏటీ లోపల భద్రంగా ఉంటాయని ఆ పేపర్లు తర్వాత ఆడిట్‌లో లెక్కించటం జరుగుతుందని మూడవది కంట్రోల్ యూనిట్ ప్రజలు వేసే ప్రతి ఒక్క ఓటు కంట్రోల్ యూనిట్‌లో నమోదు అవ్వడమే కాకుండా వాళ్ళు ఓటు వేసిన తర్వాత బీప్ శబ్దం వస్తుందని ఆ శబ్దం వచ్చాకే తదుపరి ఓటర్ ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని, ఎంత మంది ఓటు వేశారు కంట్రోల్ యూనిట్ ద్వారానే తెలుస్తుందని అన్నారు. నగరంలోని అన్ని ప్రదేశాలలో వ్యాన్ ద్వారా ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. నగరంలోని అన్నివార్డుల్లో సూపర్ వైజర్లతో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఓలతో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అలాగే ప్రతి రోజు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు అవగాహన కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఆర్ఓ సేతుమాదవ్, ఈడిటి జీవన్, మేనేజర్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.